సాక్షి కామారెడ్డి

గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



పన్నుల వసూళ్లపై దృష్టి

బాన్సువాడ బల్దియాలో ఆస్తి పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. బకాయిదారులకు నోటీసులు ఇస్తున్నారు.

- 9లో ▸



నష్ట పరిహారం చెల్లిస్తాం

రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని సబ్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.1 /15.0

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పోలీస్ స్టేషన్ తనిఖీ



నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్పీ సింధుశర్మ తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఎస్సై మల్లారెడ్డితో మాట్లాడి స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన కేసులతోపాటు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. రాత్రివేళ ముమ్మరంగా పెట్రోలింగ్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆమెవెంట ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ నాయక్, ఏఎస్సై ఉమేష్ తదితరులున్నారు.

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా జ్ఞానేశ్వరి



కామారెడ్డి టౌన్: జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కామారెడ్డి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో రెండోసారి జిల్లా అధ్యక్షురాలిగా నియమించినందుకు ఆమె రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

బాన్సువాడ రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి గురువారం తుది గడువు అని తాడ్కోల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీబాయి తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు సమర్పించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 23న అర్హత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా ఎంపిక చేస్తారని తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో వీఆర్‌ఏల నిరసన



పిట్లం: తహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం వీఆర్‌ఏలు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా తమ సమస్యలను రెవెన్యూ శాఖ మంత్రికి చెప్పుకోవడానికి వెళ్లిన వీఆర్‌ఏ వారసులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. అరెస్టులను నిరసిస్తూ తహసీల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టామని పేర్కొన్నారు. తమకు ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

బీజేపీ మండలాల అధ్యక్షుల ఎన్నిక

కామారెడ్డి టౌన్: జిల్లాలోని పలు మండలాల అధ్యక్షులను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ తెలిపారు. మిగతా మండలాల అధ్యక్షులను త్వరలోనే ఎన్నుకుంటామని పేర్కొన్నారు. నూతన అధ్యక్షుల పేర్లను ప్రకటించారు.

మండలం	అధ్యక్షుడు
కామారెడ్డి టౌన్	మోటూరి శ్రీకాంత్
కామారెడ్డి రూరల్	సీహెచ్ శ్రీధర్
మాచారెడ్డి	బూస సురేశ్
పాల్వంచ	పోసు అనిల్
బీబీపేట్	అల్లం ప్రవీణ్
దోమకొండ	భూపాల్‌రెడ్డి
భిక్కనూరు	ఉప్పరి రమేశ్
రాజంపేట్	సంపత్‌రెడ్డి
ఎల్లారెడ్డి టౌన్	ఏడీ సురేశ్
తాడ్వాయి	వై.సంతోష్‌రెడ్డి
లింగంపేట	క్రాంతి కుమార్
నాగిరెడ్డిపేట్	శ్రీనివాస్
జుక్కల్	బాలాజీ కుమార్
బిచ్కుంద	విష్ణు
మద్నూర్	తుకారాం పటేల్
దోంగ్లీ	ధనుంజయ్ పాటిల్
బాన్సువాడ రూరల్	మజ్జి శ్రీనివాస్
బీర్కూర్	నాగేళ్ల సాయికృష్ణ



ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటు చేయాల్సిన స్థలం

బస్ డిపో.. ఏర్పాటు ఎప్పుడో?

- దశాబ్దాలుగా ప్రహరీకే పరిమితం
- ఎన్నికల హామీగానే మిగిలిన డిపో
- నెరవేరని ఎల్లారెడ్డి ప్రజల ఆకాంక్ష

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎల్లారెడ్డి ప్రాంతవాసుల కల దశాబ్దాలుగా నెరవేరడం లేదు. పట్టణంలో బస్ డిపో ఏర్పాటు ఎన్నికల హామీగానే మిగిలిపోయింది. ఎల్లారెడ్డి పట్టణంలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని రెండున్నర దశాబ్దాల క్రితం నిర్ణయించారు. ఏడెకరాల భూమిలో బస్ డిపో ఏర్పాటు కోసం అప్పట్లో శంకుస్థాపన చేశారు. స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించారు. దీంతో త్వరలోనే బస్ డిపో ఏర్పాటవుతుందని ప్రజలు ఆశించారు. కానీ ఆ ఆశ రెండున్నర దశాబ్దాలు దాటినా నెరవేరలేదు. పాలకులు కాంపౌండ్ వాల్‌తోనే సరిపెట్టారు. ఏళ్లు గడుస్తున్నా బస్‌డిపో ఏర్పాటుకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడడంలేదు. రెండేళ్ల క్రితం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో బస్ డిపో ఏర్పాటైంది. గతేడాది సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోనూ బస్ డిపో ఏర్పాటు చేశారు. ఇరుగు పొరుగు జిల్లాల్లో బస్ డిపోలు ఏర్పాటవుతున్నా కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మాత్రం ఎన్నికల హామీగానే మిగిలిపోయింది.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

మీటింగ్‌లకు వేదికగా మారిన స్థలం

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రాజకీయ పార్టీల సభలకు, అధికారిక సభలకు బస్ డిపో స్థలం వేదికగా ఉపయోగపడుతోంది. రెండున్నర దశాబ్దాలుగా బస్ డిపో గ్రౌండ్‌లో ఎన్నో సభలు జరిగాయి. ఆ స్థలం వేదికగానే ఎందరో నాయకులు ఎల్లారెడ్డిలో బస్ డిపో ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారు. అవి ఇప్పటికీ అమలు కాలేదు. అలాగే యువకులు, విద్యార్థులు బస్‌డిపో స్థలంలో క్రికెట్ ఆడుతుంటారు. ఇటీవల అధికార పార్టీకి చెందిన నాయకులు క్రికెట్ పోటీలు డిపో స్థలంలోనే నిర్వహించారు.

బస్‌డిపో ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరినట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తెలిపారు. బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందించానన్నారు. ఎల్లారెడ్డిలో బస్ డిపో ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరానన్నారు.

ముందడుగు పడేనా?

ఎల్లారెడ్డిలో ఎవరిని కదిలించినా బస్ డిపో ఏర్పాటు అవుతుందన్న నమ్మకం పోయిందన్న సమాధానమే వస్తుంది. ఎన్నో ఏళ్లుగా బస్ డిపో పేరుతో ఓట్లు దండుకున్నారు తప్ప, డిపో ఏర్పాటుకు ఎలాంటి ప్రయత్నం చేయడంలేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా బస్ డిపో ఏర్పాటు చేసి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బస్ డిపో సాధించి తీరతానని పేర్కొంటున్నారని, ఆయన మాట నిలుపుకోవాలని కోరుతున్నారు.

రవాణా సౌకర్యం లేక..

ఎల్లారెడ్డి పట్టణానికి నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, లింగంపేట, గాంధారి తదితర మండలాల నుంచి నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. జుక్కల్ ప్రాంతంతోపాటు సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఎల్లారెడ్డి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. బాన్సువాడ, మెదక్, హైదరాబాద్‌ల మధ్య నడిచే బస్సులన్నీ ఎల్లారెడ్డి మీదుగానే తిరుగుతాయి. ఎల్లారెడ్డికి చుట్టుపక్కల వందలాది గ్రామాలున్నాయి. ఎల్లారెడ్డి బస్టాండ్ ఎప్పుడూ ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఎల్లారెడ్డి చుట్టుపక్కల మండలాలకు కామారెడ్డి, బాన్సువాడ డిపోల బస్సులు వస్తుంటాయి. అయితే మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాలకు మాత్రమే ఆయా డిపోలనుంచి బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. చాలా పల్లెటూర్లకు బస్సు సర్వీసులు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర డిపోల అధికారులు ఎల్లారెడ్డి ప్రాంతంలోని గ్రామాలను పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఇప్పటికీ బస్సు తిరగని గ్రామాలు ఎన్నో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఎల్లారెడ్డిలో బస్ డిపో ఏర్పాటయితే సమీపంలోని చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం ఏర్పడుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ఎల్లారెడ్డిలో బస్ డిపో అంశం తెరపైకి వస్తుంది. తర్వాత ఎవరూ పట్టించుకోరు.

ఖాతాల్లో రైతు భరోసా జమ

- ఎకరంలోపు భూమి ఉన్న రైతులకు అందిన సాయం
- జిల్లాలో 1,09,125 మందికి లబ్ధి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రభుత్వం రైతుభరోసా నిధులను విడుదల చేసింది. బుధవారం ఎకరంలోపు భూమి ఉన్న రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేసింది. జిల్లాలో ఎకరంలోపు భూమి ఉన్న రైతులు 1,09,125 మంది ఖాతాలలో రూ.37.90 కోట్లు జమ అయ్యాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. గతంలో రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున అందించేవారు. దీనిని రూ. 6 వేలకు పెంచిన విషయం తెలిసిందే. రిపబ్లిక్ డే రోజున మండలానికి ఒక గ్రామంలో నాలుగు పథకాలను ప్రారంభించి ఆయా గ్రామాలకు చెందిన రైతులందరి ఖాతాల్లో రైతుభరోసా సొమ్ము జమ చేశారు. మిగిలిన రైతులకు రైతుభరోసా పంపిణీ బుధవారం ప్రారంభమైంది. విడతల వారీగా రైతుల ఖాతాలలో పెట్టుబడి సాయం జమ చేయనున్నారు.

నేడు రైతులతో వీడియో కాన్ఫరెన్సు!

రైతుభరోసా సొమ్ము జమ చేస్తున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు గురువారం రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే అవకాశాలున్నాయి. మంత్రి ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు.

పరుగులు తీస్తున్న పసిడి

- 10 గ్రాములకు రూ.87 వేలు..
- కొనుగోలుదారుల్లో ఆందోళన



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బంగారం ధరలు రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిణామాలతో ధరలు రోజురోజుకూ పెరుగుతూ వస్తున్నాయి. బుధవారం కామారెడ్డి బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.87 వేలకు చేరింది. పెళ్లిళ్ల సీజన్‌లో ధరలు పెరగడంతో కొనుగోలుదారులతో పాటు ఆభరణాల తయారీదారులూ ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరలు భారంగా మారాయని వారు పేర్కొంటున్నారు. ముందే ఒప్పందం చేసుకున్న పనులకు సంబంధించి ధరలు పెరగడం వల్ల నష్టపోవాల్సి వస్తోందని ఆభరణాల తయారీదారులు ఆవేదన చెందుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: సీడీపీవోలు, సూపర్‌వైజర్లు నెలలో కనీసం 20 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నడపవద్దన్నారు. కొత్త భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో విద్యుత్ సరఫరా లేని కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రావణ్ కుమార్‌కు సూచించారు. వేసవిలోగా అన్ని కేంద్రాలకు తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య తక్కువగా ఉండడం, రికార్డుల్లో మాత్రం ఎక్కువ మందిని నమోదు చేయడం వంటివి జరుగుతున్నట్లు తెలిసిందన్నారు. ఇలాంటివి జరగకుండా చూడాలని, కేంద్రాలకు పిల్లలు, బాలింతలు, గర్భిణులు వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, పంచాయతీరాజ్ శాఖ ఈఈ దుర్గాప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ రమేశ్, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

అసంపూర్తి పనులతో అవస్థలు



ఒకవైపు తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

- ముందుకు సాగని జుక్కల్ –డోన్‌గావ్ రోడ్డు పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జుక్కల్ నియోజకవర్గంలో రోడ్డు పనులు మధ్యలో ఆగిపోవడం ప్రజలకు శాపంగా మారింది. జుక్కల్ మండల కేంద్రం నుంచి దోస్త్‌పల్లి మీదుగా డోన్‌గావ్‌కు వెళ్లే రోడ్డు పనులు పూర్తవకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు విస్తరణ పనులను 2023లో ఎస్‌సీ ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 4.40 కోట్లతో ప్రారంభించారు. కొంతమేర పనులు జరిగాయి. రెండు కిలోమీటర్ల మేర రోడ్డు వెడల్పు చేయడానికి మట్టి తవ్వి పనులను ఆపేశారు. అలాగే మరో రెండు కిలోమీటర్లకుపైగా రోడ్డుపై కంకర పోసి వదిలేశారు. దీంతో ఈ రోడ్డుపై వెళ్లడం ఇబ్బందికరంగా మారింది. జుక్కల్ మండల కేంద్రానికి ఇది దగ్గరి దారి కావడంతో చుట్టుపక్కలనున్న ఇరవైకి పైగా గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మీదుగానే ప్రయాణిస్తారు. అలాగే పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని ఔరద్ ప్రాంతానికి వెళ్లేవారంతా ఈ మార్గంలోనే వెళతారు. నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కంకర రాళ్లతో టైర్లు దెబ్బతింటున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ కోసం ఒకవైపు తవ్వి వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయంటున్నారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



కంకర వేసి వదిలేసిన దృశ్యం

నిర్లక్ష్యం నీడన ఆక్సిజన్ పార్క్

- రూ. 29.50 లక్షలతో నిర్మాణం
- నిర్వహణ లేక అధ్వానంగా మారిన పరిసరాలు
- నీళ్లు లేక ఎండుతున్న చెట్లు
- పట్టించుకోని అధికారులు



జుక్కల్‌లో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ పార్క్



నిజాంసాగర్(జుక్కల్): శ్యామా ప్రసాద్ ముఖర్జీ నేషనల్ రూర్బన్ మిషన్‌లో భాగంగా జుక్కల్‌లో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆక్సిజన్ పార్క్ నిర్వహణ లేక వృథాగా మారింది. అటవీశాఖ ఆధ్వర్యంలో 2003లో రూ. 29.50 లక్షలతో ఈ పార్క్ ఏర్పాటు చేశారు. ఆహ్లాదంతో పాటు సుగంధాన్ని పంచే మొక్కలతోపాటు పూల మొక్కలు నాటారు. పిల్లలతో పాటు మహిళలు, పురుషులు, వృద్ధులకు అవసరమైన ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. కూర్చోవడానికి బల్లలూ ఏర్పాటు చేశారు.

పట్టించుకోని పంచాయతీ అధికారులు

అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్క్‌ను గ్రామ పంచాయతీకి అప్పగించారు. అయితే పార్క్ నిర్వహణ విషయంలో జుక్కల్ గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యపు ధోరణి అవలంబించారు. నీరుపట్టేవారు లేకపోవడంతో మొక్కలు ఎండుముఖం పడుతున్నాయి. నిర్వహణ లేకపోవడంతో పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. అధికారుల నిర్లక్ష్యంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్క్.. చెత్తకుప్పలా మారింది. అధికారులు స్పందించి, పార్క్‌ను అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.



మూలనపడ్డ ఆట వస్తువులు

పంచాయతీకి బాధ్యతలు ఇచ్చాం

ఆక్సిజన్ పార్క్ నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీకి అప్పగించాం. ప్రత్యేకంగా ఒక మనిషిని కేటాయించి, పార్క్‌ను కాపాడుతాం.

– శ్రీనివాస్, ఎంపీడీవో, జుక్కల్

పరీక్ష కేంద్రం పరిశీలన

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లోని పరీక్షా కేంద్రాన్ని యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ యాదగిరిరావు బుధవారం సందర్శించారు. పీజీ సెమిస్టర్ పరీక్షల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని తెలుసుకున్నారు. సౌత్ క్యాంపస్‌లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయన వెంట రిజిస్ట్రార్ యాదగిరి, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఏపీఆర్‌వో సరిత, అధ్యాపకులు ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైస్‌చాన్స్‌లర్ యాదగిరిరావు

ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే చెల్లించాలి

భిక్కనూరు: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భిక్కనూరు మండల కేంద్రంలోని పాత జాతీయ రహదారిపై టీజీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్ మాట్లాడుతూ విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థలలో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయడంతో పాటు విద్యాశాఖకు మంత్రిని నియమించాలని కోరారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి విద్యార్థి నేతలను బలవంతంగా పక్కకు తప్పించారు. రాస్తారోకోలో టీజీవీపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి సమీర్‌ఖాన్, నేతలు నిశాంత్, సందీప్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో రాస్తారోకో చేస్తున్న టీజీవీపీ నాయకులను పక్కకు లాగేస్తున్న పోలీసులు

క్లుప్తంగా

మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వానం



కామారెడ్డి క్రైం: తన కుమారుడి వివాహానికి విచ్చేసి వధూవరులను ఆహ్వానించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ మాజీ సీఎం కేసీఆర్‌ను కోరారు. బుధవారం ఆయన, కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కలిశారు. ఈ నెల 10న హైదరాబాద్‌లో జరుగనున్న వేడుకకు రావాలని కోరుతూ వివాహ పత్రికను కేసీఆర్‌కు అందించారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్న తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగానికి చెందిన వలంటీర్ తరుణ్, తెలంగాణ కాంటింజెంట్ లీడర్ డాక్టర్ ఎం సునీతను వీసీ టి యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఎం యాదగిరి బుధవారం అభినందించారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశ అత్యున్నత స్థాయి కార్యక్రమంలో పాల్గొనడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, ఆఫీసర్ డాక్టర్ స్వప్న,జూనియర్ అసిస్టెంట్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన ఆఫ్రికన్ అతిథి



ఆఫ్రికా దేశానికి చెందిన బూడిద రంగు కొంగ ఒకటి మండలంలోని ఘన్ పూర్లో ప్రత్యక్షమైంది.గ్రామానికి చెందిన మాజీ వీఎస్ఎస్ చైర్మన్ ఏనుగు దయాకర్‌రావు ఇంటి సమీపంలో బుధవారం తచ్చాడుతున్న కొంగను 'సాక్షి' క్లిక్ మనిపించింది.

–మాచారెడ్డి

బాలలతో పని చేయిస్తే కేసులే..

- జిల్లాలో ఇద్దరిపై కేసులు నమోదు
- 600 మంది బాలల గుర్తింపు
- సీడబ్ల్యూసీ ఎదుట తల్లిదండ్రులకు కౌన్సెలింగ్, బాలల అప్పగింత
- దర్పన్ యాప్‌లో వివరాలు నమోదు



ఖలీల్‌వాడి: ఆర్మూర్ డివిజన్‌లోని నందిపేట్‌లో ఆపరేషన్ స్మైల్ బృందం తనిఖీలు చేయగా ఓ బాలుడు (15) పని చేస్తూ కనిపించాడు. వివరాలు తెలుసుకొని బాలుడితో కఠినమైన పనిచేయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేయించారు.

నిజామాబాద్ నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీల్లో భాగంగా స్మైల్ బృందం సభ్యులు బాలుడి చేత పనిచేయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేయించారు.

ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని 2015 నుంచి ప్రభుత్వం ప్రారంభించింది. ప్రతి ఏడాది జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పోలీసుశాఖ, మహిళా శిశు సంక్షేమ, కార్మిక శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. జనవరిలో జిల్లాలో మూడు బృందాలు 60 మంది పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వారితో పని చేయించిన యజమానులపై కేసులు నమోదు చేశారు.

ఆపరేషన్ స్మైల్‌లో సభ్యులు వీరే..

నిజామాబాద్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లో మూడు బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తారు. ఇందులో ఓ ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉండగా ఒక మహిళ, ఇద్దరు పురుషులు ఉంటారు. మూడు బృందాల్లో ముగ్గురు ఎస్సైలు, 9 మంది కానిస్టేబుళ్లు ఉంటారు. వీరితోపాటు కార్మికశాఖ అధికారి, బాలల పరిరక్షణ సమితి ఉద్యోగి, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రతినిధి ఆపరేషన్ స్మైల్ బృందంలో ఉంటారు.

ఆపరేషన్ స్మైల్ ఉద్దేశం ఇదే..

లైంగిక దాడుల నుంచి విముక్తి, మానవ అక్రమ రవాణా నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు, మత్తుకు బానిసయ్యే వారిని సమాజంలో కలిపి బాధ్యతాయుతంగా మెదిలేలా చేయడంతోపాటు వారికి నాణ్యమైన విద్యనందించడం కోసం ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 18 ఏళ్ల వరకు ఉచిత విద్య, సంరక్షణ కల్పించేందుకు ఆపరేషన్ స్మైల్ ఎంతగానో తోడ్పడుతుంది. తల్లిదండ్రులకు అప్పగించిన తర్వాత బాలలు చదువుకుంటున్నారా? ఎలాంటి పనులు చేస్తున్నారు? అనే దానిపై ఆరా తీస్తారు.

బాలలకు వెలుగులు..

భిక్షాటన చేసే పిల్లలను గుర్తించడంతోపాటు తప్పిపోయినవారిని అనాథ పిల్లలను శిశు రక్షణ కేంద్రాల్లో ఉంచుతారు. వివిధ చోట్ల పని చేసే బాలలను గుర్తించి వారిని సీడబ్ల్యూసీ ఎదుట ఉంచి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగిస్తారు. బాలల వివరాలను దర్పన్ యాప్‌లో నమోదు చేస్తారు. తల్లిదండ్రుల సహకారంతో బాలలను చదివించడానికి బాలల సంక్షేమ సమితి సహకారంతో పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా ప్రతియేటా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని చేపట్టి బాలల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

జనవరిలో డివిజన్‌ల వారీగా గుర్తించిన బాలల వివరాలు

నిజామాబాద్	ఆర్మూర్	బోధన్	మొత్తం
20	17	23	60

కేసులు నమోదు చేస్తాం

18 ఏళ్ల లోపు బాలలతో పని చేయించే యజమానులపై కేసులు నమోదు చేసి రూ.25 వేల జరిమానా విధిస్తాం. బాలలతో పనిచేయించే వారి సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 1098కి అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– స్రవంతి, ఎస్సై, షీ టీం, నిజామాబాద్

మద్దతివ్వండి.. అండగా నిలబడతాం



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య

సుభాష్‌నగర్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి మద్దతుగా నిలవాలని, గెలుపొందిన తర్వాత నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఉమ్మడి నిజామాబాద్ – ఆదిలాబాద్ – కరీంనగర్ – మెదక్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షా సమావేశం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని వారు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని, బీజేపీపై అభిమానం పెరుగుతోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుంటే భవిష్యత్‌లో అసెంబ్లీపై కాషాయ జెండా ఎగురవేయడానికి పునాది అవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి అన్నారు. ప్రభుత్వం బీసీల్లో ఉన్న ముస్లిములను లెక్కించినప్పుడు.. ఎస్సీల్లో ఉన్న క్రైస్తవులను కూడా లెక్కించాలని డిమాండ్‌చేశారు. జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి, టక్కర్ హన్మంత్‌రెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, బద్దం లింగారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, స్రవంతిరెడ్డి పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



ఎడపల్లి(బోధన్):మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ ఏటీఎంలో మంగళవారం రాత్రి దుండగులు చోరీకి యత్నించారు. ఏటీఎం ముందున్న సీసీ కెమెరాలపై నల్లటి రంగు పూసి లోనికి వెళ్తుండగా పోలీసులు ఎస్కార్ట్ బైక్‌పై అటువైపు రావడంతో దుండగులు తాము వచ్చిన కారులో పరారయ్యారు. ఎస్కార్ట్ బైక్‌పై పోలీసులు ఇద్దరు మాత్రమే ఉండడంతో దుండగుల వాహనాన్ని వెంబడించలేదు.

ప్రయోగ పరీక్ష కేంద్రాల తనిఖీ



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న ప్రయోగ పరీక్షల నిర్వహణ తీరును జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాకతీయ, ఎస్ఆర్, వెక్టార్, సత్య కళాశాలలను డీఐఈవో తనిఖీ చేయగా, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 15 కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ మాట్లాడుతూ.. పరీక్షాకేంద్రాల్లో జియో ట్యాగింగ్ చేయాలని, కెమెరాలు పని చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కెమెరాల ద్వారా హైదరాబాద్ నుంచి కమిషనర్ పర్యవేక్షిస్తున్నారన్నారు. తనిఖీల్లో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయేవారికి నష్టపరిహారం చెల్లిస్తాం

బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్– బోధన్ రహదారి విస్తరణ పనుల్లో భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం అందిస్తామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బుధవారం మహమ్మద్‌నగర్ తహసీల్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. బాన్సువాడ డివిజన్ పరిధిలో 38 ఎకరాల భూముల్లో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. విస్తరణ పనులకు రైతులు సహకరించాలని కోరారు. తహసీల్దార్ సవాయిసింగ్, గిర్దావర్ పండరి తదితరులున్నారు.

'పీఆర్సీని 51 శాతం ఫిట్‌మెంట్‌తో మంజూరు చేయాలి'



మాట్లాడుతున్న నరాల వెంకట్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్: ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీని 51 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం టీఎన్‌జీవోస్ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ నేతలు మాట్లాడుతూ.. బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు అందజేసి ఉద్యోగులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల పాలిట పెనుశాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి ముల్క నాగరాజు, కోశాధికారి ఎం.దేవరాజు, ఉపాధ్యక్షులు యు.సాయిలు, శ్రావణ్, లక్ష్మణ్, రాజ్యలక్ష్మి, రాజేశ్వర్, పోచయ్య, అర్బన్ అధ్యక్షుడు కే.శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర మాస్టిన్ కమిటీ ఎన్నిక





బీబీపేట: తెలంగాణ రాష్ట్ర మాస్టిన్ కమిటీ సభ్యులను హైదరాబాద్‌లో బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఇస్సానగర్ గ్రామానికి చెందిన వారికి పదవులు కల్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బుద్దుల సాయిలు, రాష్ట్ర కార్యదర్శిగా బుద్దుల రాజనర్సు, జాయింట్ సెక్రటరీగా రాజశేఖర్, రాష్ట్ర కోశాధికారిగా శంకర్, ముఖ్య నాయకులుగా దశరథం, యాదగిరి, ప్రచార కమిటీ సభ్యుడిగా రామదాసులను ఎన్నుకున్నారు.

మున్నూరు కాపు మండల కార్యవర్గం ఎన్నిక

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం తుంకిపల్లిలో బుధవారం మున్నూరుకాపు మండల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా లింగాల శంకర్ పటేల్, గౌరవ అధ్యక్షుడిగా బీమన్‌పల్లి లక్ష్మీనారాయణ, యూత్ అధ్యక్షుడిగా బొర్ర నరేశ్ పటేల్, ఉపాధ్యక్షులుగా దఫేదార్ విజయ్‌కుమార్, శీలం సాయిలు, ప్రధాన కార్యదర్శిగా కలకొండ నారాయణ, జాయింట్ సెక్రెటరీలుగా వెల్లుట్ల సాయిలు, బిట్ల అశోక్, కోశాధికారిగా కలకొండ సిద్ధిరాములు, కార్యవర్గ సభ్యులుగా పెరుగు బాలకిషన్, లింగాల నరేందర్, మాలీస్ రాజు, మండల కో–ఆర్డినేటర్‌గా గాండ్ల రవీందర్‌లను ఎన్నుకున్నారు.

బిచ్కుంద మండల కార్యవర్గం

బిచ్కుంద(జుక్కల్): మండల మున్నూరు కాపు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దర్పల్ సంతోష్, గౌరవ అధ్యక్షులుగా నాల్చార్ రాజు, దడ్గి నాగ్‌నాథ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నాందేవ్, సాయిలు, కోశాధికారిగా కొట్టం సాయిలు తదితరులు ఎన్నికయ్యారు.

50వేలకు పైగా కోళ్ల మృత్యువాత!



పౌల్ట్రీని పరిశీలిస్తున్న వెటర్నరీ అధికారులు



వైరస్ కారణంగా మృతి చెందిన కోళ్లు

- బాయిలర్ కోళ్లకు అంతుచిక్కని వ్యాధి
- జిల్లాలో 11 ఫారాల్లో విస్తరించిన వైరస్
- శాంపిళ్లను సేకరించిన పశుసంవర్ధక శాఖ

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో బాయిలర్ కోళ్లకు అంతు చిక్కని వ్యాధి వేగంగా వ్యాపిస్తోంది. ఫారాల్లో పెరుగుతున్న కోళ్లు భారీ సంఖ్యలో చనిపోతున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే భీమ్‌గల్, వేల్పూర్, నవీపేట్, పోతంగల్, కమ్మర్‌పల్లి ప్రాంతాల్లోని 11 ఫారాల్లో వైరస్ విస్తరించగా 50వేల కోళ్లకు పైగా మృత్యువాత పడ్డాయి. వాటిని తీసుకెళ్లి గుంతలను తవ్వి అందులో పూడ్చి పెడుతున్నారు. దీంతో కోళ్ల ఫారాల నిర్వాహకులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడి మొత్తం కోల్పోయామని ఆందోళన చెందుతున్నారు. ఒకదాని నుంచి మరొక దానికి వైరస్ వేగంగా వ్యాపిస్తుండడంతో కోళ్ల మరణాల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. అప్రమత్తమైన పశుసంవర్ధక శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న కోళ్ల ఫారాల నిర్వాహకులను కూడా అప్రమత్తం చేసింది. పశువైద్య అధికారులు పౌల్ట్రీల వద్దకు వెళ్లి చనిపోయిన కోళ్ల నుంచి శాంపిళ్లను సేకరిస్తున్నారు. కోళ్ల మృతికి కొక్కెర వ్యాధి కారణం కావొచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నప్పటికీ నిర్ధారణ కోసం శాంపిళ్లను హైదరాబాద్‌లోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ యూనిట్‌కు పంపించారు. నాలుగు రోజుల్లో రిపోర్టు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో బాయిలర్ కోళ్లను పెంచుతున్న ఫారాలు మొత్తం వందకుపైగా ఉండగా, లేయర్ ఫారాలు 20వరకు ఉన్నాయి. కోళ్లను పెంచే ఫారాల్లోనే వైరస్ ఎక్కువగా వ్యాపిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఫారాలు దగ్గర దగ్గరగా ఉంటే తొందరగా కోళ్లకు వైరస్ వస్తోంది. వైరస్ సోకిన ఒకటి, రెండు రోజుల్లో చనిపోతున్నాయని, మందులు వాడినా ప్రయోజనం ఉండడం లేదని పౌల్ట్రీ నిర్వాహకులు చెబున్నారు. అయితే వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కోళ్ల ఫారాల్లో జీవ సంరక్షణ చర్యలు చేపట్టాలని, తరచుగా శానిటేషన్ చేయాలని పౌల్ట్రీ నిర్వాహకులకు సూచనలు చేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి 'సాక్షి'కి తెలిపారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కితే ఫిర్యాదు చేయాలి



మాట్లాడుతున్న సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశ్వర్‌రావు

ఖలీల్‌వాడి: సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కితే బాధితులు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశ్వరావు సూచించారు. నగర శివారులోని మానిక్‌బండార్‌లో ఉన్న కిట్స్ కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైంపై బుధవారం ఏసీపీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎంలలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి డబ్బులు వస్తే వెంటనే స్పందించొద్దని అన్నారు. ఇటీవల కాలంలో జంప్ డిపాజిట్ స్కామ్స్ ఎక్కువగా జరుగుతున్నాయని, యూపీఐలో గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు పంపించి మెసేజ్‌లు, ఫోన్‌లు చేస్తారని, వెంటనే బ్యాలెన్స్ చెక్ చేసుకుంటే ఖాతాలో ఉన్న నగదును సైబర్ మోసగాళ్లు కాజేస్తారని అన్నారు. అలాగే మల్టీలెవల్ మార్కెటింగ్, పిరమిడ్ స్కామ్స్ ఎక్కువగా జరుగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మతిస్థిమితం లేని వృద్ధుడు మృతి



గంగాధర్ మృతదేహం

నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్లారం గండిలో రెంజల్ మండలానికి చెందిన గంగాధర్(65) అనే వృద్ధుడు మృతి చెందినట్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై–2 ఆనంద్‌సాగర్ బుధవారం తెలిపారు. రెంజల్ మండల కేంద్రానికి చెందిన గంగాధర్ గత 20 సంవత్సరాలుగా మతిస్థిమితం లేక ఇంటిలో నుంచి బయటికి వస్తూ తిరుగుతుండేవాడని, ఈ క్రమంలో రెంజల్ నుంచి మల్లారం గండి వరకు వచ్చాడన్నారు. గత నాలుగైదు రోజులుగా ఆహారం లేక మల్లారం గండిలో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టామన్నారు. మృతుడిని రెంజల్‌కు చెందిన గంగాధర్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కూతురు ఉన్నారని ఎస్సై తెలిపారు.

చెట్టును ఢీకొన్న బైక్.. ఒకరు..



హరిసింగ్ (ఫైల్)

సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్ శివారులో బైక్ చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్సై ఎల్ రామ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మెట్టుమర్రి తండాకు చెందిన బట్టు హరిసింగ్(55) బుధవారం మధ్యాహ్నం తన బైక్‌పై సిరికొండకు వెళ్తుండగా, హుస్సేన్‌నగర్ శివారులో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్నది. పక్కనే ఉన్న పొలంలో పడి తీవ్ర గాయాలపాలైన హరిసింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పలువురికి జైలు శిక్ష

వేల్పూర్/కమ్మర్‌పల్లి/రుద్రూర్/బోధన్ టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పలువురికి జైలు శిక్ష విధిస్తూ ఆర్మూర్, బోధన్ న్యాయస్థానాలు తీర్పు వెలువరించాయి. వేల్పూర్ మండలం రామన్నపేట్‌కు చెందిన వ్యక్తికి, కమ్మర్‌పల్లికి చెందిన మరో వ్యక్తికి ఆర్మూర్ కోర్టు మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సైలు సంజీవ్, అనిల్‌రెడ్డి తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ కామారెడ్డికి చెందిన ఒకరు, మహారాష్ట్రకు చెందిన మరొకరు పట్టుబడ్డారని కోటగిరి ఎస్సై సందీప్, బోధన్ పట్టణంలోని బీటీ నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి, హున్సాకు చెందిన మరో వ్యక్తి పట్టుబడ్డారని పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. పట్టుబడిన వారిని బోధన్ కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారని సీఐ, ఎస్సైలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పిట్లం(జుక్కల్): అనుమతులు లేకుండా బిచ్కుంద మండలం వాజీద్‌నగర్ శివారులోని మంజీరా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రాజు బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఐదు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఆరేడ్‌లో ఓ ట్రాక్టర్..

నిజాంసాగర్(జుక్కల్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని ఆరేడ్‌లో బుధవారం సీజ్ చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన కొంకుల నర్సింలు అనుమతి లేకుండా తన ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండటంతో కేసు నమోదు చేశామన్నారు.

వాహనాలు సీజ్



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసిన పలు వాహనాలను పట్టణ పోలీసులు బుధవారం సీజ్ చేసి ఠాణాకు తరలించారు. ద్విచక్ర వాహనాలను లిఫ్ట్ సహాయంతో డీసీఎంలోకి ఎక్కించి తరలించారు. పార్కింగ్ స్థలం తక్కువగా ఉందని, అలాంటప్పుడు వాహనాలు ఎక్కడ నిలపాలని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో దేగాం గ్రామానికి చెందిన గూండ పెద్ద గంగారాం అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గంగారాం తన ద్విచక్ర వాహనంపై బుధవారం అర్గుల్ నుంచి తొర్లికొండకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. గంగారాంను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఎల్లారెడ్డిలో చోరీ

ఎల్లారెడ్డి : పట్టణంలోని బీసీ కాలనీలో నివాసముండే జునైద్ అనే వ్యక్తి ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. జునైద్ అంగడికి వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు బీరువాలోని 3 తులాల బంగారం, కొంత నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చుక్కాపూర్‌లో బైక్..

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నుంచి ఈ నెల 2న కామారెడ్డికి చెందిన శంకర్‌రావు బైక్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. ఆలయంలోకి వెళ్లి వచ్చేసరికి బైక్‌ను ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

బైకును ఢీకొట్టిన కంటైనర్

ఎల్లారెడ్డిరూరల్: పట్టణ శివారులోని పెద్ద చెరువు కట్ట వద్ద బైక్‌ను కంటైనర్ ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లికి చెందిన రాజు ఎల్లారెడ్డి నుంచి తన గ్రామానికి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి ఎల్లారెడ్డి వైపునకు వస్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజు చెరువు కట్ట పైనుంచి కింద పడగా గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లోఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కంటైనర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.